క్లుప్తంగా

'ఉపాధి' కింద పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

గాండ్లపెంట: ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరానికి పండ్లతోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అంజనప్ప సూచించారు. కటారుపల్లి పంచాయతీ పరిధిలోని బాదరాతి గుట్ట వద్ద జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పండ్లతోటల పెంపకం కోసం క్షేత్ర, సాంకేతిక సహాయకులకు రైతులు దరఖాస్తులు అందించాలన్నారు.

కదిరిలో ముగిసిన పాదయాత్ర

కదిరి అర్బన్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కదిరి నియోజకవర్గంలో ముగిసింది. మంగళవారం ఉదయం స్థానిక డీఎస్పీ కార్యాలయం ముందు విడిది గృహం నుంచి పాదయాత్ర ప్రారభమైంది. మార్గం మధ్యలో టిడ్కో గృహసముదాయాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ముత్యాలచెరువులో భోజన విరామంతో పాదయాత్ర ముగిసింది.

టేకు, నేరేడుచెట్లకు నిప్పు


కాలిపోయిన టేకు చెట్లు

గాండ్లపెంట: చిన్నక్కగారిపల్లి గ్రామంలో రైతు సాంబశివారెడ్డికి చెందిన టేకు, అల్లనేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈయన రెండున్నర ఎకరాల్లో 200 టేకు, 50 అల్లనేరేడు చెట్లు పెంచాడు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గ్రామస్తులు, సమీప పొలాల్లోని కూలీలు వచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినప్పటికీ చెట్లు పూర్తిగా కాలిపోయి రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

పాల ఏకరులను నారా లోకేష్ అవమానించారు

కదిరి అర్బన్: తమను బీసీ ఆత్మీయ సమావేశానికి ఆహ్వానించి అవమానించడం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌కు తగదని పాల ఏకరుల సంఘం కదిరి డివిజన్ నాయకులు ప్రభాకర్‌నాయుడు, లక్ష్మీపతినాయుడు, యర్రప్పనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో పాల ఏకరులతో మాట్లాడకుండా... కనీసం అర్జీకూడా తీసుకోకుండా అవమానించారన్నారు. టీడీపీ హయాంలో తమను ఓటుబ్యాంకుగా వాడుకుని చిన్నచూపు చూశారన్నారు. వైఎస్సార్ హయాంలో పాల ఏకరులను బీసీ జాబితాలో చేర్చారని, దీంతో తమ కులస్తులు డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. తమ పట్ల నారా లోకేష్ వ్యవహరించిన తీరుకు తమ కులానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ముదిగుబ్బ: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న తిరుపతి నాయుడు అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. తిరుపతి నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం బత్తలపల్లి వెళ్లారు. పసిగట్టిన దొంగలు ఇంట్లో చొరబడి రూ.1.80 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటికి రాగా ఈ ఘటన వెలుగు చూడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఉగాది సంబరాలు

నల్లచెరువు: మండల పరిధిలోని శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. స్వామి వారికి ప్రత్యేకపూజలు, పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

ఎలవగంప ఊరేగింపు



కొత్తచెరువు: లింగారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం కమ్మదేవతల ఎలవగంపను ఘనంగా ఊరేగించారు. సి.కె.పల్లి మండలం ఒంటి కొండలో జరిగే అక్కమ్మ దేవతల ఉత్సవానికి ఎలవగంపను తీసుకెళ్లి ఉత్సవాలు నిర్వహిస్తారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

సిరి ధాన్యాల్లో ఒకటైన రాగి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాల్షియం, ప్రొటీన్లు, ఫైబర్ అధికంగా ఉండే రాగి ఉత్పత్తులను ఆహారంలో తీసుకుంటే మంచి ఆరోగ్యం లభిస్తుంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిళ్లను తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని ఇస్తాయి. ఈక్రమంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో జగనన్న ప్రభుత్వం గోరుముద్ద పథకం కింద ఇప్పటికే అనేక పోషకాలతో కూడిన ఆహారాన్ని రోజూ మధ్యాహ్న భోజనం కింద అందజేస్తోంది. తాజాగా అదనంగా రాగిజావను మెనూలో చేర్చింది. మంగళవారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లోని ప్రతి పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు రాగి జావను పంపిణీ చేశారు. విద్యార్థులు చాలా ఇష్టంగా రాగిజావను తాగారు. వైఎస్ జగన్ మామయ్యకు థ్యాంక్స్ చెప్పారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీకి శ్రీకారం
- ఇష్టంగా తాగిన విద్యార్థులు

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సిద్దారెడ్డి ఆధ్వర్యంలో రాగిజావను ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీటీసీ అమరావతి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఎంపీడీఓ అంజినప్ప, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీటీసీ ఖమర్‌జహాన్ పాల్గొన్నారు. 500 మంది విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఉప్పర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీని ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, దంపెట్ల సర్పంచు చల్లా కరుణాకర్ నాయుడు ప్రారంభించారు. ఎంఈఓ చాముండేశ్వరి అధ్యక్షత వహించారు. మండల వ్యాప్తంగా 2,998 మందికి రాగిజావ అందజేశారు.


పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లిలో రాగిజావ అందజేస్తున్న అగ్రిబోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

ముదిగుబ్బ: మలకవేమల జిల్లా పరిషత్, ఎంపీయుపీ పాఠశాల విద్యార్థులకు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ సుధాకర్‌నాయక్, మలకవేమల, సానేవారిపల్లి సర్పంచ్‌లు రమణ, టి.రమణ పంపిణీ చేశారు.

ధర్మవరం రూరల్: గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ గిరక రమాదేవి రాగిజావ పంపిణీ చేశారు.

అమడగూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావను అందజేశారు.

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో రాగిజావ పంపిణీని ఎంపీడీఓ శకుంతల ప్రారంభించారు. ఎంఈఓ తిరుపాల్ నాయక్, ప్రిన్సిపాల్ రాణాప్రతాప్, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు పాల్గొన్నారు.

తలుపుల: సోమలవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ వెంకట్రాముడు రాగిజావను పంపిణీ చేశారు. విద్యార్థులకు పౌష్టిక లోపాల నివారణకు రాగిజావ ఉపకరిస్తుందన్నారు. హెచ్‌ఎం బాబాఫక్ర్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటపతినాయుడు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొక్కంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ వైవీ కౌసల్య, సర్పంచ్ వైవీ మల్లీశ్వరి విద్యార్థులకు రాగిజావను అందజేశారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో రాగి జావను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పంపిణీ చేశారు. కౌన్సిలర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని 42 పాఠశాలల్లో దాదాపు 5,200 మంది విద్యార్థులకు రాగిజావ అందజేశారు. పెడపల్లి ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ఏవి రమణారెడ్డి, నిడిమామిడిలో వైస్ ఎంపీపీ రంగన్న, ఎంపీటీసీ సరస్వతీబాయి, సర్పంచ్ మంగ్లీబాయి, మోడల్‌స్కూల్‌లో అగ్రిబోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, వెంగళమ్మచెరువులో హనుమంతరెడ్డి రాగిజావ పంపిణీ చేశారు.


తనకల్లు: విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఎంపీపీ కౌసల్య, సర్పంచ్ మల్లీశ్వరీ

ఎన్పీకుంట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కమిటీ చైర్మన్ భాస్కర్‌తో కలిసి ఎంఈఓ గోపాల్‌నాయక్ రాగిజావను పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం రామాంజులుయాదవ్, పాల్గొన్నారు.

కనగానపల్లి: ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ మంగళవారం తూంచర్ల ప్రాథమిక పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ అరుణమ్మ, సర్పంచ్ రేణుకమ్మ, పాఠశాల చైర్మన్ బాబయ్య, హెచ్‌ఎం రంగారెడ్డి, నాయకులు నాగముని పాల్గొన్నారు.

ధర్మవరం: రాగిజావ విద్యార్థులకు మంచి ఆరోగ్యమని ఆర్డీఓ తిప్పేనాయక్, ఎంఈఓ సుధాకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాగిజావతా విద్యార్థులకు బలవర్ధక ఆహారం లభిస్తుందన్నారు. దీంతో వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు కౌన్సిలర్లు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం బాల బాలికల ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీకి ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం హెచ్‌ఎం రమణప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, దుద్దుకుంట వెంకటరెడ్డి తదితరులు ప్రారంభించారు.

ఓడీ చెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంబీ క్రాస్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీడీఓ పోలప్ప, ఎంపీపీ ఫర్వీన్‌బాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి రాగిజావను పంపిణీ చేశారు. సర్పంచు గోవిందు,హెచ్‌ఎం శంకర్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లి: విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచు


ధర్మవరం: విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్


కనగానపల్లిలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, అధికారులు


పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి


ధర్మవరం అర్బన్: విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున


గాండ్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావను అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు





పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి/కదిరి/ధర్మవరం/రాప్తాడు రూరల్: పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల ప్రజలకు ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటనలు విడుదల చేశారు. ఈ ఏడాది కూడా సమృద్ధిగా వానలు కురవాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం చేపట్టే ప్రతి కార్యక్రమం దిగ్విజయంగా నెరవేరాలని అభిలషించారు. కొత్త ఏడాదిలో ప్రతి ఇల్లూ సంతోషంతో కళకళలాడాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, భోగ భాగ్యాలతో వర్ధిల్లాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

నల్లచెరువు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం కింద పంతులచెరువు గ్రామంలో చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మధునాయక్ విజ్ఞప్తి చేశారు. పంతులచెరువు ఆయకట్టు సర్వే నంబర్లు 79 నుంచి 116, 144 నుంచి 174, 193నుంచి 359 వరకు ఉన్న పట్టాదారులు తమ భూమిలో ఉన్న కంపచెట్లను తొలగించి రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మార్కెట్లలో కొనుగోళ్ల సందడి


ధర్మవరం: జనసందోహంతో నిండిన పీఆర్‌టీ సర్కిల్

ధర్మవరం అర్బన్: మార్కెట్లకు ఉగాది పండుగ శోభ వచ్చింది. ఉగాదిని ఘనంగా నిర్వహించుకునేందుకు అవసరమైన పూజా సామగ్రి కోసం ప్రజలు తరలిరావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి. మామిడాకులు, పూలు, టెంకాయలు, వంట సామగ్రి కొనుగోలు చేశారు. ధర్మవరంలోని పీఆర్‌టీ సర్కిల్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు రహదారులు రద్దీగా మారాయి.

కదిరి టౌన్: పట్టణంలో బట్టల దుకాణాలు, జనరల్ స్టోర్స్ జనంతో కిటకిటలాడాయి. టెంకాయలు, మామిడాకులు, పూల విక్రయాలు జోరుగా సాగాయి.

ముస్లింలను మోసం చేసింది టీడీపీనే

- వైఎస్సార్‌సీపీ నేత ఎస్‌ఎండీ ఇస్మాయిల్


ఎస్‌ఎండీ ఇస్మాయిల్

కదిరి అర్బన్: ముస్లిం మైనార్టీలను మోసం చేసింది టీడీపీ అధినేత చంద్రబాబునాయుడేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా కదిరిలో ముస్లిం మైనార్టీలతో ముఖాముఖీ నిర్వహించి ముస్లింలపై కపట ప్రేమ చూపించారన్నారు. 2014 మంత్రిమండలిలో ముస్లిం మైనార్టీ శాఖను ముస్లిమేతరులకు అప్పగించి ముస్లింలను మోసం చేశారన్నారు. చివరి ఆరునెలల్లో కంటితుడుపు చర్యల్లో భాగంగా నంద్యాల ఫారూక్‌కు ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు పెద్దపీట వేశారన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఒక డిప్యూటీ సీఎం ముస్లిం వర్గానికి చెందినవారేనన్నారు. అదేవిధంగా శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళను నియమించారన్నారు. ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగు సంవత్సరాల కాలంలో రూ.10,771 కోట్లు నాన్ డీబీటీ ద్వారా 10,319 కోట్లు మైనార్టీలకు అందించారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ముస్లింల సంక్షేమానికి కేవలం రూ.2660 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, జగనన్న ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో రూ.3428 కోట్లు ఖర్చు చేసిందని ఆయన అన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

తనకల్లు: మండల పరిధిలోని డీ. చెక్కవారిపల్లిలో మృతి చెందిన జరిపిటి ఉమాదేవి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ. 10 వేలు సర్పంచ్ నాగరాజు మంగళవారం అందజేశారు.

సుంకం వసూళ్ల వేలంలో అదనపు ఆదాయం

ధర్మవరం: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ లింగం నిర్మల అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో మంగళవారం వారపుసంత, జంతువధశాలకు వేలం నిర్వహించారు. వారపుసంతను సర్కారు పాటగా రూ.56 లక్షల 80వేలతో ప్రారంభించగా రూ.58 లక్షలకు రాఘవరెడ్డి అనే వ్యక్తి దక్కించుకున్నారు. దీంతో గత ఏడాది కంటే రూ.1.20 లక్షలు అదనంగా ఆదాయం వచ్చింది. జంతువధశాలకు సర్కారు పాట రూ.91వేలకు ప్రారంభించగా రూ.1.05 లక్షలకు ఇబ్రహీం అనే వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ వేలంపాటలో వైస్ చైర్మెన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, ఆర్‌ఓ ఆనంద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఓడీ చెరువు: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద ఆశ్రమ ఆధ్వర్యంలో రూపొందించిన త్రైత శకం తెలుగు నూతన క్యాలెండర్‌ను మంగళవారం తహసీల్దార్ శ్రీధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగప్ప,బిల్లా శ్రీనివాసులు, గణేష్, తిరుపతయ్య, రాజశేఖర్, చంద్రశేఖర్, పద్మావతి పాల్గొన్నారు.

18 మినీ డెయిరీల మంజూరు

తలుపుల: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా అమూల్ పాలసేకరణకు మండలంలో 18 గ్రామాలకు మినీ డెయిరీలు మంజూరైనట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ సెంటర్ మంజూరు

తలుపుల: వేపమానిపేట సచివాలయానికి ఆధార్ అప్‌డేట్ సెంటర్ మంజూరైనట్లు ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం తెలిపారు. వేపమానిపేట, గుండువారిపల్లి, పెద్దన్నవారిపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తామన్నారు.

ఒంటికొండ అక్కమ్మ ఊరేగింపు


అమ్మవారి ఊరేగింపు దృశ్యం

చెన్నేకొత్తపల్లి: ఒంటికొండలో అక్కమ్మగారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి జలధి ఊరేగింపు నిర్వహించారు. ఒంటికొండ, ఓబుళంపల్లి, ప్రసన్నాయపేట, ఆమిదాలకుంట గ్రామాల మీదుగా కొండపగానిపల్లి బుగ్గమడుగు వరకు అమ్మవారి యలవగంపను ఊరేగించారు.

సహకార సంఘాలను బలోపేతం చేయండి


రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లిఖిత

ప్రశాంతి నిలయం: రైతాంగాన్ని ప్రోత్సహించడానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా విరివిగా రుణాలు అందిస్తున్నట్లు సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత పేర్కొన్నారు. మంగళవారం అమె జిల్లా కేంద్రంలోని ఏడీసీసీ బ్యాంక్‌ను తనిఖీ చేశారు. వ్యవసాయ రుణాల వివరాలు, ఎల్‌టీ లోన్‌ల వివరాలు, డిపాజిట్ల సేకరణపై మేనేజర్ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. డిపాజిట్లు సేకరించి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. పుట్టపర్తి, వెంగళమ్మ చెరువు, గూనిపల్లి, బుక్కపట్నం సొసైటీల సీఈఓలు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: సహకార బ్యాంక్‌ను అభివృద్ధి బాటలో నడపాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత సూచించారు. మంగళవారం ఆమె ఓడీ చెరువు ఏడీసీసీ బ్యాంకులో రికార్డులను తనిఖీ చేశారు. మేనేజర్ కుసుమకుమారి పాల్గొన్నారు.

కొత్తచెరువు: కొత్తచెరువులోని ఏడీసీసీ బ్యాంకును సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత తనిఖీ చేశారు. బ్యాంకు లావాదేవీలు, రికార్డులను పరిశీలించారు.

క్షతగాత్రురాలు చెన్నైకి తరలింపు

బత్తలపల్లి: మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షాహిస్తాను మెరుగైన వైద్యం కోసం మంగళవారం చెన్నైకి తరలించారు. ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ ఫయాజ్(38) కదిరిలో బంధువుల ఇంటిలో జరుగుతున్న శుభకార్యక్రమానికి కుమార్తె షాహిస్తాతో కలిసి వెళ్లారు. తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. మహమ్మద్ ఫయాజ్ మృతి చెందగా షాహిస్తా గాయపడింది. ఆమెను అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు.

సచివాలయాల తనిఖీ

తలుపుల: నూతనకాల్వ, ఓబులరెడ్డిపల్లి, పులిగుండ్లపల్లి సచివాలయాలను ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, ఉద్యోగుల హాజరును పరిశీలించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు.

వారపు సంతకు 24న వేలం

ఓడీ చెరువు: ఓడీ చెరువు గ్రామ వారపు సంతకు ఈ నెల 24న గ్రామ సచివాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ రాజశేఖర్, గ్రామ కార్యదర్శి ప్రసాద్ మంగళవారం తెలిపారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత-2023 అవార్డుకు మెప్మా పొదుపు సంఘాలకు చెందిన ఔత్సాహికులైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పుట్టపర్తి నగర పంచాయతీ కమిషనర్ వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణ ప్రాంతంలో పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, పెరటి మొక్కల, మిద్దె తోటల పెంపకం, చెత్తనుంచి సంపద తయారీ వంటి అంశాలలో ప్రతిభ కనబరచిన మహిళలకు అవార్డు అందజేస్తారన్నారు.

సైకిళ్ల పంపిణీ

కదిరి అర్బన్: చైల్డ్‌ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం 20 మంది పేద విద్యార్థులకు ఆర్డీఓ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు సైకిళ్లు అందజేశారు.

సత్యసాయి ట్రస్టు సేవలు ఎనలేనివి


ఆర్‌జె.రత్నాకర్ రాజును దుశ్శాలువాతో సన్మానిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్, చిత్రంలో కలెక్టర్ బసంత్ కుమార్,జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రశాంతినిలయం: జగనన్న గోరుముద్ద పథకం కింద రాగిజావను అందించే కార్యక్రమానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సహకారాన్ని అందిస్తుండడంపై అభినందనలు తెలుపుతూ ప్రభుత్వం తరఫున హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మంగళవారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలకు రాగి జావ అందించేందుకు ఏటా రూ.42 కోట్లు వెచ్చించడం సమాజ సేవ పట్ల ట్రస్ట్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బసంత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు.